సాక్షి

# 'మెట్రో' స్వాధీనానికి అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

- తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి
- ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులు.. ఏకపక్షమన్న బీఆర్ఎస్






సాక్షి, హైదరాబాద్: మెట్రోరైల్ ప్రాజెక్టును స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభలో ప్రకటించారు. బడ్జెట్ పద్దులపై చర్చ సమయంలో సీఎం ప్రత్యేక ప్రకటన చేశారు. విశాల ప్రజా ప్రయోజనాల దృష్ట్యా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్(క్యూర్)కు మెట్రో నెట్‌వర్క్ విస్తరించాలనే వివిధ వర్గాల డిమాండ్ మేరకు మెట్రో విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. విస్తరణకు ఉన్న అడ్డంకులను, ఎదురవుతున్న ఇబ్బందులను లోతుగా సమీక్షించిందని, ప్రస్తుతమున్న మెట్రో ఫేజ్ 1 మొత్తం 69 కిలోమీటర్లు ఉందని, ఫేజ్ 2(ఏ) కేటగిరీలో 76.4 కిలోమీటర్లు, ఫేజ్ 2 (బీ) 86.1 కిలోమీటర్ల మేర విస్తరణ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామన్నారు. హైదరాబాద్ మెట్రో విస్తరణకు ప్రస్తుతం ఉన్న ప్రత్యేక పరిస్థితిని సభ ముందుంచామని, ఫేజ్-1 ప్రైవేట్ నిర్వహణలో ఉండగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ఫేజ్-2 ప్రభుత్వ ప్రాజెక్టుగా చేపట్టేందుకు ఎదురవుతున్న సాంకేతిక, చట్టపరమైన, నిర్వహణ సమస్యలను దృష్టిలోకి తీసుకున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం లేవనెత్తిన అంశాలను పరిష్కరించేందుకు ఎల్అండ్‌టీ సంస్థ నుంచి మెట్రో ఫేజ్-1 నెట్‌వర్క్‌ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునే నిర్ణయాన్ని ఈ సభలో తీర్మానం ద్వారా ప్రవేశపెడుతున్నామన్నారు. మెట్రో ఫేజ్-1 స్వాధీనం చేసుకునే ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను సభ సమర్థించి, పూర్తి మద్దతు ప్రకటించాలని, ఫేజ్-2 విస్తరణకు కేంద్ర ప్రభుత్వ ఆమోదం త్వరగా పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా కృషి చేయాలని సీఎం వివరించారు. దీంతో సభ ఏక్రగీవంగా ఆమోదించిందని స్పీకర్ ప్రకటించారు. అయితే బీఆర్ఎస్ఎల్పీ నేత హరీశ్‌రావుతో పాటు పలువురు సభ్యులు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ అంశంపై చర్చ లేకుండా ఏకగ్రీవ ఆమోదం అనలేమని, ఇది పూర్తిగా ఏకపక్షమని విమర్శించారు. ఎల్అండ్‌టీ నుంచి హెచ్ఎంఆర్ ప్రాజెక్టు స్వాధీనం, ఫేజ్-2 ఏ,బీ ప్రాజెక్టుల వివరాలను, పరిస్థితులకు సంబంధించిన ప్రత్యేక ప్రకటనను మంత్రి శ్రీధర్‌బాబు సభలో కూలంకషంగా వివరించారు.